కొనసాగిన న్యాయవాదుల నిరసన దీక్ష

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణంలోని కోర్టు భవనాల వద్ద నిరసన దీక్ష తెలుపుతున్న న్యాయవాదుల నిరసన దీక్ష శనివారం నాటికి 19వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాట్లాడుతూ భూ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని నిరసన దీక్ష విరమించేది లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బసవరావు, రామారావు, రమేష్, తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.



దీక్షల్లో కుర్చున్న న్యాయవాదులు

కోడి పందేలకు సై..సై..!

చాట్రాయి మండలం పర్వతాపురంలో కోడిపందేలకు సిద్ధమైన బరి

రెండు జిల్లాల్లోనూ బరులు సిద్ధం
నేడు 11 గంటల తర్వాత కొనసాగనున్న పందేల జోరు
పండుగ మూడు రోజులు ఇక రక్తసిక్తమే
బరుల ప్రాతిపదికన పోలీసులకు మాముళ్లు
తూతూమంత్రంగా బరులు ధ్వంసం
గుండాట, మూడు ముక్కలాటలకు సైతం అనుమతి!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కోడి పందేలకు పందెంరాయుళ్లు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. ఆదివారం భోగి రోజు ఉదయం 11 గంటల తర్వాత పందేల జోరుకు అంతా సై..సై అంటూ కేరింతలు కొడుతున్నారు. బరుల ధ్వంసం, కోడిపందేలను అడ్డుకుంటామంటూ బీరాలు పలికిన అధికార యంత్రాంగం పండుగ మూడు రోజులు ప్రేక్షకపాత్రకు పరిమితం కానుందని స్పష్టంగా తెలుస్తోంది. దీంతో ఈ ఏడాదీ రెండు జిల్లాల్లోనూ పందేల జోరు యథాతథంగా సాగనున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో కోడి పందేలకు పందెంరాయుళ్లు సిద్ధమయ్యారు. ఇప్పటికే బరులకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశారు. ట్రాక్టర్లతో చదును చేయించి, టెంట్లు వేయడం వంటి అన్ని పనులూ పూర్తయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లాలో పెదఅమిరం, సీసలి, ఆకివీడు మండలం కుప్పనపూడి, పాలకొల్లు మండలం పూలపల్లి, యలమంచిలి మండలం కలగంపూడి, తాడేపల్లిగూడెం, తణుకు వంటి పలు మండలాల్లో కోడి పందేల బరులు కొనసాగనున్నాయి. ఏలూరు జిల్లాలో ఉంగుటూరు, నారాయణపురం, బాదంపూడి, భీమడోలు మండలంలో గుండుగొలను, ఆగడాలలంక, పెదవేగి, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం మండలాల్లోనూ పెద్దఎత్తున పందేల నిర్వహణకు పందెంరాయుళ్లు సమాయత్తమయ్యారు. ప్రతి మండలంలోనూ పెద్ద, చిన్న కలుపుకుని పది వరకూ బరులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. రెండు జిల్లాల్లోనూ దాదాపు 400కు పైగా బరుల్లో కోడిపందేలు సాగనున్నాయని స్పష్టమవుతోంది. ఇప్పటికే భీమవరంతోపాటు ఏలూరు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు వంటి పట్టణాల్లో హోటల్ రూమ్ నిండుకున్నాయి. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి కూడా పందెంరాయుళ్లు ఆదివారం జిల్లాకు రానున్నారు. భోగి రోజు ఉదయం పది గంటల వరకూ పోలీసుల హడావుడి ఉంటుందని, తర్వాత పందేలకు ఎటువంటి ఇబ్బందీ ఉండదని పందెంరాయుళ్లు ధీమాగా ఉన్నారు. బైండోవర్ కేసులు, బరుల ధ్వంసం వంటి కార్యక్రమాలన్నీ కోర్టుకు చూపించడానికి తప్ప, పందేలు ఆపేందుకు కాదని పందెంరాయుళ్లు ఢంకాబజాయించి చెబుతున్నారు. బరుల వద్ద గుండాట, పేకాటకు సంబంధించి శనివారం సాయంత్రం వరకూ అనుమతులు రాలేదు. పందేలు ప్రారంభమయ్యే సమయానికి వాటికి అనుమతులు ఇవ్వనున్నట్లు తెలిసింది. పెద్ద బరుల వద్ద రాత్రీ పగలు నిరంతరాయంగా పందేలు సాగించేందుకు ఫ్లడ్‌లైట్లు సైతం ఏర్పాటు చేస్తున్నారు. పండుగ మూడు రోజులు రూ.కోట్లలో సొమ్ము బెట్టింగ్ రూపంలో చేతులు మారనుంది. అమాయక ప్రజానీకం మరోసారి కోడిపందేలకు ఆకర్షితులై జేబులు గుల్ల చేసుకునే పరిస్థితి నెలకొంది.

మాముళ్లు ఇచ్చుకోండి.. పందేలు వేసుకోండి..!

పందేలను అడ్డుకుంటామంటూ హెచ్చరికలు చేస్తున్న పోలీసులు.. పందెంరాయుళ్లకు మాత్రం తమ పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చేసినట్లు తెలిసింది. పెద్ద బరులకు రూ.లక్ష, ఓ మోస్తరు బరికి రూ.70 వేలు, మిగిలిన వాటికి బరుల ప్రాతిపదికన ధరలు నిర్ణయించి వసూలు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఎన్నికల నేపథ్యంలో కొద్దిరోజుల్లో పోలీసు అధికారులంతా బదిలీలు కానున్నారు. ఇదే అదునుగా వచ్చినకాడికి దండుకోవాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. పలుచోట్ల పోలీసు అధికారులే కబుర్లు పంపించి పందేలు వేసుకోండంటూ చెబుతున్నట్లు ప్రచారం సాగుతోంది. దీంతో పందెంరాయుళ్లు మరింత రెచ్చిపోతున్నారు. పండుగ మూడు రోజులు పందేలకు అడ్డూఅదుపు లేకుండాపోయే పరిస్థితి కనిపిస్తోంది. హైకోర్టు ఆదేశాలు ఎప్పటికి అమలయ్యేనో అని ప్రజానీకం ఎదురుచూడక తప్పని పరిస్థితి ఉంది.

కాళ్ల మండలం పెదఅమిరంలో కోడిపందేలకు సిద్ధమైన బరి

సంక్రాంతి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

సంక్రాంతి పండుగ ప్రతిఇంటా సిరి సంపదలు కురిపించాలి. జిల్లా ప్రజలకు భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు. ప్రతిఒక్కరూ పండగను ఆనందంగా జరుపుకోవాలి. పంటలు బాగా పండాలి. జిల్లా సర్వతోముఖాభివృద్ధిలో అంతా భాగస్వాములు కావాలనేది నా ఆకాంక్ష.

కలల పంట పండాలి

బి.లావణ్యవేణి, జాయింట్ కలెక్టర్

సంక్రాంతి పండుగ సందర్భంగా అందరి ఇంటా కలల పంట పండాలి. ఈ పండుగ ప్రతిఒక్కరి జీవితంలో కొత్త వెలుగులు నింపాలి. జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు. అంతా ఆనందంగా పండుగ జరుపుకోవాలి.

29న భీమడోలులో 'రా.. కదలిరా'

హాజరు కానున్న చంద్రబాబు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న నేతలు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలులో ఈ నెల 29న టిడిపి ఆధ్వర్యంలో నిర్వహించే 'రా.. కదలిరా' కార్యక్రమానికి తమ అధినేత చంద్రబాబు హాజరు కానున్నారని ఆ పార్టీ ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు తెలిపారు. శనివారం మాజీ ఎంపీ మాగంటి బాబు, మాజీ ఎంఎల్ఎలు ఘంటా మురళి, చింతమనేని ప్రభాకర్, ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బడేటి రాధాకృష్ణతోపాటు పలువురు నేతలు భీమడోలు వచ్చారు. సభా వేదికగా నిర్ణయించిన భీమడోలు హైస్కూల్ ఎదురుగా జాతీయ రహదారి పక్కనే ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. జన సమీకరణ, కార్యక్రమ నిర్వహణ, ఇతర అంశాలపై వారు చర్చించారు. అనంతరం గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ ఈ నెల 14, 15 తేదీల్లో ఉంగుటూరు నియోజకవర్గ స్థాయి భోగి సంకల్పం కార్యక్రమాన్ని టిడిపి, జనసేన సంయుక్తంగా నిర్వహించనున్నాయన్నారు. 29న చంద్రబాబు సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

భూ హక్కు చట్టం కాపీలు భోగి మంటల్లో వేయండి

రైతులకు ఏపి రైతుసంఘం పిలుపు

ఏలూరు: భూయాజమాన్య హక్కుల చట్టం (ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్) కాపీలను భోగిమంటల్లో వేసి దహనం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రైతులకు పిలుపునిచ్చింది. శనివారం స్థానిక అన్నే భవనంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నిమ్మగడ్డ నర్సింహా, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్టం రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అంబానీ, అదానీ వంటి కార్పొరేట్లకు భూములను కట్టబెట్టేందుకే ఈ చట్టం ఉపయోగపడుతుందన్నారు. ఈ చట్ట ప్రతులను భోగిమంటల్లో వేసి దహనం చేసి రైతులు తమ నిరసన తెలియజేయాలని కోరారు.

సంక్రాంతి రద్దీ

జిల్లాలో ఎక్కడ చూసినా సంక్రాంతి రద్దీ కన్పించింది. ఇటు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ప్రధాన రహదారులు ప్రయాణికులు, వాహనాలతో కిటకిటలాడాయి. ఇక మార్కెట్లన్నీ కొనుగోలుదారులతో కళకళలాడాయి.

ఏలూరుఅర్బన్ : ఏలూరు సమీపంలోని కలపర్రు టోల్‌గేట్ వద్ద వాహనాల క్యూ

ఏలూరుఅర్బన్: కిటకిటలాడుతున్న ఏలూరు బస్టాండు

ఉంగుటూరు: నారాయణపురం సెంటర్లో వాహనాల రద్దీ

ఇంటికి, పండుగకు దూరంగా.. డిమాండ్ల సాధనే ధ్యేయంగా..

33వ రోజు అంగన్వాడీల సమ్మె- ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా కోటి సంతకాల సేకరణ- పలుచోట్ల మెడకు ఉరితాళ్లు, నోటికి నల్ల రిబ్బన్లతో నిరసన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండల కేంద్రంలో అంగన్వాడీ నిరసనలు 33వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కోటి సంతకాల కార్యక్రమం ప్రారంభించారు. అంగన్వాడీ సమ్మెకు మద్దతుగా యుటిఎఫ్ నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. వారు మాట్లాడుతూ 33 రోజుల నుంచి అంగన్వాడీ సెంటర్స్‌కు, ఇంటికి, పండుగలకు, దూరంగా ఉంటూ.. మీ లక్ష్య సాధనకు పోరాడటం చూస్తుంటే మీ పట్టుదల ఏపాటిదన్నది అర్థమవుతుందన్నారు. మీ న్యాయమైన డిమాండ్స్‌ను ప్రభుత్వం అర్థం చేసుకుని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు, ఎస్.రమేష్ బాబు, బివి.రావు, పి.శ్రీనివాసు, ఎస్‌కె.రఫీ, అంగన్వాడీ ప్రాజెక్ట్ అధ్యక్షులు శివరత్న కుమారి, పి.పద్మజ, జె.నాగవేని, అడపా నాగజ్యోతి, సిహెచ్.సునితరయల్, బొబ్బిలి చిట్టి, కె.జ్యోతి, కె.మాధవి, పి.భాగ్యలక్ష్మి, ఎమ్.వెంకటలక్ష్మి, ఎమ్.మంగా, శ్రీదేవి, నుర్జాహన్ పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుండా మొండిగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ ఏలూరు కలెక్టరేట్ వద్ద అంగన్వాడీలు మెడకు ఉరితాళ్లు తగిలించుకొని వినూత్నంగా నిరసన తెలిపారు. అంగన్వాడీల సమ్మె 33వ రోజులో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 13న జరిగిన చర్చల్లో రాష్ట్ర ప్రభుత్వం సమస్యలు పరిష్కరించే దిశగా ఆలోచన చేయకుండా సమస్యలను జటిలం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల జూలైలో వేతనాలు పెంచాలని చెప్పడం హాస్యాస్పదమని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి రవి మాట్లాడుతూ అంగన్వాడీల డిమాండ్లు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలకు అండగా నిలబడతామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వివిఎన్ ప్రసాద్, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామల రాణి, దళిత నాయకులు మాముడూరి మహంకాళి, సిఐటియు నాయకులు బి.సోమయ్య, వి.సాయిబాబా, అంగన్వాడీ యూనియన్ నాయకులు భవాని, స్వప్న, హైమావతి పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : మెడకు ఉరితాళ్లు వేసుకుని నిరసన తెల్పుతున్న అంగన్వాడీలు

ముసునూరులో..

జీలుగుమిల్లి : అంగన్వాడీల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం తామంతా అండగా ఉంటామని పలువురు వక్తలు అంగన్వాడీలకు హామీ ఇచ్చారు. 33వ రోజు అంగన్వాడీల సమ్మెలో భాగంగా శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న అంగన్వాడీల సమ్మె శిబిరం వద్ద రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో ఈ సమావేశానికి అంగన్వాడీ ప్రాజెక్టు అధ్యక్షురాలు ఊర్ల నాగమణి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మోడియం నాగమణి, జనసేన నియోజకవర్గం కన్వీనర్ సిరి బాలరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ, సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు, కాంగ్రెస్ మండల కార్యదర్శి జాల సీతారాముడు, సిఐటియు మండల కార్యదర్శి చిట్టి బొమ్మ కొండల రావు, రైతు కూలీసంఘం మండల నాయకులు వెట్టి సుబ్బన్న, పిడిఎస్‌యు రాష్ట్ర నాయకులు భూషణం, ప్రజా సంఘాల నాయకులు ఎన్‌వి.అప్పారావు మద్దతు తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు జ్యోతి, ఎస్తేరు, పూర్ణవతి, మంగ, వెంకయ్యమ్మ పాల్గొన్నారు.

ముసునూరు : పాదయాత్ర అప్పుడు ఇచ్చిన మాటను తప్పిన జగన్మోహన్ రెడ్డికి ఇంతకు ఇంత రెట్టింపు, మాటకు మాట నెరవేరుస్తామని నూజివీడు ప్రాజెక్టు కార్యదర్శి పల్లిపాము రాజకుమారి అన్నారు. శనివారం మండల కేంద్రమైన ముసునూరు గ్రామ సచివాలయం వద్ద అంగన్వాడీల నిరసన కార్యక్రమం 33వ రోపు కొనసాగింది. ఈ కార్యక్రమంలో భాగంగా మాటతప్పిన జగన్మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా నోటికి నల్ల రిబ్బన్ కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కలపాల విద్యావతి, మేరీసులోచన, దుర్గ, లక్ష్మి, వెంకటేశ్వరమ్మ, శిరీష, విజయలక్ష్మి, సుజాత, అలివేలు, మంగమ్మ పాల్గొన్నారు.



కొయ్యలగూడెంలో..

నూజివీడు రూరల్ : నూజివీడు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద అంగన్వాడీల నిరసన దీక్ష శనివారం నాటికి 33వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు కార్యదర్శి ఎన్‌ఆర్.హనుమాన్లు మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని, ప్రభుత్వం మొండి వైఖరిని విడనడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.రాజు, ఆదిలక్ష్మి, లక్ష్మీకాంతం, రమాదేవి, పద్మజ్యోతి పాల్గొన్నారు.

కలిదిండి : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 33వ రోజుకు చేరింది. ప్రభుత్వంతో చర్చలు విఫలం కావడంతో మౌనంగా ఉండి నిరసన తెలిపారు. ఒబిసి నాయకులు లావేటి వీర శివాజీ శిబిరానికి చేరి సమ్మెకు మద్దతు తెలిపారు. అంగన్వాడీ సంఘం నాయకులు షేక్ అబిదా బేగం, జెక్కంశెట్టి మేనక లక్ష్మి, కొప్పినీడి రమాదేవి, అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.

చింతలపూడి : మండల కేంద్రంలో అంగన్వాడీల సమ్మె 33వ రోజుకి చేరింది. అంగన్వాడీ కార్యకర్తలు కఠోర నియమంతో సమ్మెలో పాల్గొన్నారు. సిఐటియు మండల అధ్యక్షులు నత్తం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె నిరంతరాయంగా కొనసాగుతుందని తెలిపారు. తెలంగాణా కంటే వెయ్యి రూపాయలు అధిక వేతనం చెల్లించాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ చెల్లించాలని నినాదాలు చేశారు.

మండవల్లి: రూ.26 వేల కనీస వేతనం ఇచ్చి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ అంగన్వాడీలు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 33వ రోజుకు చేరుకుంది. స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న అంగన్వాడీల సమ్మెలో భాగంగా శనివారం కోటి సంతకాల సేకరణ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ లీడర్లు వాణి చెల్లమ్మ, విజయలక్ష్మి, ఉమాదేవి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల : ఈనెల 13న జరిగిన చర్చలు విఫలం కావడంతో అంగన్వాడీల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంటుంది, యూనియన్ ఇచ్చిన పిలుపుమేరకు మా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని దానిలో భాగంగా అంగన్వాడీ ఉద్యమానికి మద్దతుగా రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా కోటి సంతకాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 33వ రోజుకు చేరిన సమ్మె శిబిరాన్ని సందర్శించిన సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు మండలంలో ముఖ్యమంత్రికి ఇచ్చే వినతిపత్రంపై తొలి సంతకం చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అంగన్వాడీల పట్ల కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం దుర్మార్గం అన్నారు. సంక్రాంతి పండుగ అనంతరం ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు తులసి, సుధా, హేమలత పాల్గొన్నారు.

భీమడోలు : అంగన్వాడీలు తమ సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా 33వ రోజైన శనివారం పాలకులకు సమర్పించేందుకు కోటి సంతకాల సేకరణ ఉద్యమాన్ని భీమడోలులో ప్రారంభించారు. తొలి సంతకాన్ని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు చేశారు. సంక్రాంతి పండుగలో భాగంగా భోగి మంటలలో అంగన్వాడీలకు ఇచ్చిన షోకాజ్ పత్రాలు దగ్ధం చేయాలని కోరారు. సంక్రాంతి పండుగ అనంతరం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయనున్నట్లు అంగన్వాడీ యూనియన్ నాయకులు రాజామణి, స్వర్ణ కుమారి, చల్లామణి తెలిపారు.

టి.నరసాపురం : అంగన్వాడీ కార్యకర్తల న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలి కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడీలు, హెల్పర్లు చేపట్టిన సమ్మెలో భాగంగా 33వ రోజు శనివారం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జోక్యం చేసుకుని తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి.పనివర్థిని, ఎన్.మార్తమ్మ, ఎం.సత్యవతి, బాబి పాల్గొన్నారు.



జీలుగుమిల్లిలో సంతకాల సేకరణ

చాట్రాయి : అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న నిరవధిక సమ్మె చాట్రాయి మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద కొనసాగింది. జనసేన, బిజెపి నాయకులు మద్దతు తెలిపారు. జనసేన నూజివీడు నియోజకవర్గ నాయకులు బర్మా ఫణి బాబు, తుమ్మల జగన్, శ్రీకాంత్, బిజెపి నాయకులు శర్మ సమ్మె శిబిరం వద్దకు వెళ్లి మద్దతు తెలిపి న్యాయమైన డిమాండ్లు పరిష్కారం అయ్యేవరకు అంగన్వాడీ కార్యకర్తలకు, హెల్పర్లకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

కలిదిండిలో మౌన దీక్ష..

భీమడోలులో..

ద్వారకా తిరుమల్లో..

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సర్పంచి కైకమ్మ

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రతి అక్షరం ప్రజల పక్షం నినాదానికి అక్షర రూపం ప్రజాశక్తి పత్రికని ముదినేపల్లి గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ అన్నారు. ముదినేపల్లి బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్, పూలే విగ్రహాల వద్ద ప్రజాశక్తి 2024 నూతన క్యాలెండర్‌ను ముదినేపల్లి గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ నిర్భయంగా, నిష్పక్షపాతంగా ప్రజలకు వార్తలను అందిస్తున్న పత్రిక ప్రజాశక్తి అని ప్రశంసించారు. భవిష్యత్తులో ఇదే ఒరవడిని కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నిమ్మగడ్డ భిక్షాలు, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు భూపతి రవీంద్ర, మాల మహానాడు మండల అధ్యక్షులు పాగోలు విజయసాగర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జి.పీటర్, పూలే విగ్రహ నిర్మాణ కమిటి అధ్యక్షులు పల్లెం పుణ్యేశ్వరరావు, సొసైటీ మాజీ డైరెక్టర్ ఈడే ఉమామహేశ్వరరావు, మత్తె చెల్లయ్య, ఆకాష్, మాదు ప్రవీణ్, విలేకరులు పరిసే సందీశ్వరరావు, సెల్వరాజ్ పాల్గొన్నారు.



కళ్ల జోళ్లు పంపిణీ చేస్తున్న పిహెచ్‌సి వైద్యులు

నారాయణపురంలో కళ్లజోళ్లు పంపిణీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

జగనన్న ఆరోగ్య సురక్షా శిబిరంలో కంటి వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి కళ్లజోళ్లను శనివారం పంపిణీ చేశారు. నారాయణపురం ఆరోగ్య ఉపకేంద్రంలో లబ్ధిదారులుకు వీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి ఛాంబర్ మండల అధ్యక్షుడు బి.నాగరాజు, ఉపసర్పంచి ఎం.సాంబ, నాయకులు జి.రామారావు, శ్రీధర్, వెంకటేశ్వరరావు, వార్డు సభ్యులు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ట్రాక్టర్ తిరగబడి యువకుని మృతి

ప్రజాశక్తి - మండవల్లి

ఊక లోడుతో ఉన్న టాక్టర్ తిరగబడిన సంఘటనలో యువకుడు మృతి చెందిన సంఘటన పెరికేగూడెం వద్ద ఉన్న ప్రయివేట్ చాపల ప్యాకింగ్ కంపెనీలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుడివాడ మండలం నాగవరపాడు వైఎస్ఆర్ కాలనీకి చెందిన గడ్డం అనిల్(17) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. అయితే శనివారం తెల్లవారుజామున గ్రామస్తులతో కలిసి ఊక లోడుతో ఉన్న టాక్టర్‌ను పెరికే గూడెం వద్ద ఉన్న ప్రోగన్ ప్రాజెక్టు చేపల ప్యాకింగ్ కంపెనీలో అన్లోడ్ చేసేందుకు టాక్టర్‌లో వచ్చాడు. ఊకను అన్లోడ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు హైడ్రాలిక్ పిన్ విరిగిపోయి ఊక లోడుతో ఉన్న టాక్టర్ ట్రక్కు పక్కన ఉన్న గడ్డం అనిల్‌పై పడింది. అది గమనించిన వ్యక్తులు, కంపెనీకి సంబంధించిన మరికొందరు ఊకను తొలగించి బయటకు తీశారు. అపమార స్థితిలో ఉన్న అనిల్‌ని వైద్య నిమిత్తం కైకలూరు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అనిల్ అప్పటికే మృతి చెందినట్లు చెప్పారని పోలీసులు తెలిపారు. ఈ మేరకు బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సిహెచ్ఎస్.రామచంద్రరావు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

జీలుగుమిల్లి : మండలంలోని దర్భగూడెం జమాయిల్ ప్లాంటేషన్‌లో గుర్తు తెలియని మృతదేహాన్ని శనివారం గుర్తించినట్లు ఎస్ఐ వి.చంద్ర శేఖర్ తెలిపారు. అడవిలో పుల్లలకు వచ్చి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు తెలిపారు. వ్యక్తి చనిపోయి ఐదు రోజులు అయినట్లు, బాడి గుర్తు పట్టలేని విధంగా ఉన్నట్లు ఉందన్నారు. స్థానిక విఆర్ఓ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అదుపుతప్పిన బొలెరో : గేదెలకు గాయాలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని తుక్కులూరు గ్రామ శివారులో శనివారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బొలెరో వాహనం డ్రైవర్ మద్యం తాగి వాహనం నడపడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. మద్యం మత్తులో డ్రైవర్ గేదెలను ఢీకొట్టగా బొలెరో అదుపుతప్పి పడిపోయిందన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. దర్యాప్తు నిమిత్తం డ్రైవర్‌ను పోలీస్ స్టేషన్‌కి తీసుకువెళ్లారు. ఈ ప్రమాదంలో గేదెలకు గాయాలయ్యాయి.

పేకాటరాయుళ్లు అరెస్ట్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

పెదపాడు ఎస్ఐ చల్లా కృష్ణకి వచ్చిన సమాచారం మేరకు పెదపాడు ఎస్ఐ, వారి సిబ్బందితో పెదపాడు మండలం వెంకటాపురం గ్రామంలో పేకాట ఆడుతున్న 8 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3,140 నగదు స్వాధీనం చేసుకున్నారు. వసంత వాడ గ్రామంలో 8 మంది వ్యక్తులను, రూ.5,460 నగదును సీజ్ చేసి, సదరు 16 మంది వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుందని పెదపాడు ఎస్ఐ తెలిపారు.

ఏలూరు స్పోర్ట్స్ : పెదపాడు మండలంలో రెండు వేరు వేరు ప్రాంతాల్లో పేకాట ఆడుతున్న 17 మందిని పెదపాడు ఎస్ఐ అరెస్ట్ చేశారు. సంబంధిత వివరాలు ప్రకారం పెదపాడు మండలం అప్పని వీడి గ్రామంలో పేకాట శిబిరం నిర్వహిస్తున్నారని సమాచారాన్ని అందుకున్న ప్రతిపాడు ఎస్ఐ చల్లా కృష్ణ సిబ్బందితో దాడి చేసి అక్కడ పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.10 వేల 450 నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే పెదపాడు మండలంలో వెంకటాపురం గ్రామ శివారులలో పేకాట శిబిరంపై ఎస్ఐ చల్లాకృష్ణ సిబ్బందితో కలిసి దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.3 వేల 140 స్వాధీనం చేసుకున్నారు. అదిపాడు మండలంలో శనివారం మొత్తంగా 17 మంది పేకాటరాయళ్లను అరెస్టు చేశారు. వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

తెలంగాణా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి లక్షా ఇరవై వేల రూపాయల విలువ చేసే మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకొన్న సంఘటన మండల కేంద్రమైన ఆగిరిపల్లిలో నెలకొంది. ఆగిరిపల్లి ఎస్ఐ ఎన్.చంటిబాబు తెలిపిన వివరాల ప్రకారం ఉన్నతాధికారుల ఆదేశానుసారం ఆగిరిపల్లిలో తెలంగాణా మద్యం అమ్ముతున్న పరసా ప్రసాద్‌ని అదుపులోనికి తీసుకొని అతని వద్ద నుంచి 240 క్వాటర్ బాటిల్స్‌ను, 84 ఫుల్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకోవడం జరిగిందని, వాటి విలువ రూ.లక్షా 20 వేలుంటుందని అన్నారు. సదరు ముద్దాయి ప్రసాద్‌ను అరెస్టు చేసి నూజివీడు కోర్టులో హాజరు పర్చినట్లుగా తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఆనందంగా పండుగ జరుపుకోవాలి : తహశీల్దార్

డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో చెస్ టోర్నమెంటు ప్రారంభం-పలుచోట్ల ముగ్గుల పోటీలు

ఏలూరులో చెస్ పోటీలు ప్రారంభిస్తున్న తహశీల్దార్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సంక్రాంతి పండుగ సందర్భంగా యువత చెడు వ్యసనాల వైపు మరలకుండా తెలుగు సంస్కృతి కాపాడే విధంగా అందరూ ఆనందంగా పండుగ జరుపుకోవాలని ఏలూరు తహశీల్దార్ పి.సోమశేఖర్ పిలుపునిచ్చారు. డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో శనివారం సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఏలూరు సిపిఎం కార్యాలయంలో జిల్లా ఓపెన్ చెస్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వి.ఠాగూర్ రాజా అధ్యక్షత వహించగా తహశీల్దార్ మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈవిధంగా ఆటల పోటీలు నిర్వహించటం అభినందనీయం అన్నారు. 35 సంవత్సరాల నుంచి ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారి కృషి, పట్టుదలకు అభినందనలు తెలిపారు. యువత, ప్రజానీకం అందరూ సంక్రాంతి సందర్భంగా జూద క్రీడల వైపు మరలకుండా ఇటువంటి ఆటపాటలలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.హైమావతి మాట్లాడుతూ కొందరు రాజకీయ ప్రతినిధులు సంక్రాంతి అంటే కోడిపందేలు, పేకాట, గుండాట వంటి జూద క్రీడలను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. గ్రామాల్లో, పట్టణాల్లో ముఖ్యంగా యువత వీటి బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్రాంతి సందర్భంగా యువత చెడు వ్యసనాలు వైపు వెళ్లకుండా ఈ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. జిల్లా కార్యదర్శి లెనిన్ మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు, పేకాట, జూద క్రీడలను అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం అరికట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం సిఐటియు నాయకులు కిషోర్, చెస్ కోచ్‌లు డి.లక్ష్మణరావు, కృష్ణవేణి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన చెస్ క్రీడాకారులందరూ ఈ పోటీల్లో పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : ఉన్నతాధికారుల ఆదేశానుసారం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్‌లో మహిళలకు రంగవల్లి ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ చంటిబాబు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు తెలియజేయడానికి ముగ్గుల పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం ముగ్గుల పోటీల్లో విజేతలైన మహిళలకు ప్రోత్సాహక బహుమతులను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ తప్లీర్‌నాయక్, మహిళా పోలీసులు, మహిళలు పాల్గొన్నారు.

టి.నరసాపురం : యువత సాంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని టిడిపి సీనియర్ నాయకులు పొట్టా రామారావు తెలిపారు. మండలంలోని మర్రిగూడెం పంచాయతీ గట్టుగూడెం గ్రామంలో టిడిపి, జనసేన ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి వాలీబాల్ పోటీలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పేరుతో యువత చెడు వ్యసనాలను బానిసలు కాకుండా సాంప్రదాయ క్రీడలు నిర్వహించాలన్నారు. 12 టీమ్‌లు పాల్గొన్న ఈ టోర్నమెంట్‌లో మర్రిగూడెం పంచాయతీలోని తీగల పల్లి టీమ్ మొదటి స్థానం, ఎపి గుంట పంచాయతీలోని రామమ్మ గూడెం టీమ్‌లు రెండవ స్థానాలు సాధించాయి. ఈ కార్యక్రమంలో కుంజా లోకేష్, తుట్టి రామ చంద్ర రావు పాల్గొన్నారు.

చాట్రాయి : చాట్రాయి గ్రామంలో జనసేన, నూజివీడు నియోజకవర్గ సమన్వయకర్త బర్మా ఫణి బాబు ఆధ్వర్యంలో మన ఊరు, మన ఆట వీర మహిళల ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి, బిజెపి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఫణి బాబు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ తెలుగు వారికి శతకోటి సంబరాల సాంస్కృతిక సమ్మేళనం కొత్త ఉషస్సులు తీసుకువచ్చే పెద్ద పండగ రోజున పిల్లలు, పెద్దలతో కలిసి భోగిమంటలతో సంతోషంగా అందరూ జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మరిడి చిట్టిబాబు, టిడిపి మండల కార్యదర్శి కంచర్ల హనుమంతరావు పాల్గొన్నారు.

పొగాకు రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన వర్జీనియా పొగాకు రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం జీలుగుమిల్లి మండలం పాములవారి గూడెంలో పొగాకు రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్జీనియా పొగాకు రైతులు మిచౌంగ్ తుపాను వల్ల తీవ్రంగా నష్టపోయి ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగిన పొగాకు పంట నష్టాలకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. పొగాకు బోర్డు నిధి నుంచి ఒక్కో రైతుకు రూ.10 వేలు చొప్పున వడ్డీ లేని రుణంగా ఇస్తున్నట్లు చెబుతున్నా దీనివల్ల పొగాకు రైతులు కోలుకునే పరిస్థితి ఉండదని, ఇది కంటి తుడుపు చర్య మాత్రమేనని అన్నారు. పంట నష్టాలకు అనుగుణంగా పరిహారం ఇచ్చి ఆదుకోకపోతే అప్పులు తీర్చే మార్గం లేక పొగాకు రైతులు మరింతగా ఇబ్బందులు గురవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, బిక్కిన వీరసత్యం పాల్గొన్నారు.

రెండు నెలల్లో వైసిపి పాలన అంతం

మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

రాష్ట్ర ప్రజలకు రెండు పెద్ద పండుగలు రానున్నాయని ప్రభుత్వ మాజీ విప్, దెందులూరు మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏటా జనవరిలో వచ్చే సంక్రాంతి పండుగ ఒకటి అయితే, మరొకటి రాబోయే ఎన్నికల్లో టిడిపి-జనసేన కూటమికి ప్రజలంతా ఓట్లు వేసి అనుభవజ్ఞులైన చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడం ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేది రాష్ట్రానికి మరొక పెద్ద పండుగ అని ఆయన తెలిపారు. గత నాలుగున్నరేళ్ల వైసిపి పాలనలో రాష్ట్ర అభివృద్ధి 20 ఏళ్ల వెనక్కి వెళ్లిపోయిందని, వైసిపి చేస్తున్న అవినీతి అక్రమ పాలనలో ప్రజలకు పండగ నాడే కాదు, వారి పూర్తి జీవితాల్లో సైతం సంతోషాలు కరువయ్యాయని చింతమనేని అన్నారు. ప్రజలు మరొక్క రెండు నెలలు ఈ దుర్మార్గ పాలనను భరించక తప్పదన్నారు.

నూతన భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని తుమ్మగూడెం గ్రామంలో సర్పంచి మొలుగు మాటి మారెమ్మ, మాజీ సర్పంచి మాదల నరసింహారావు ఆధ్వర్యంలో నూజివీడు ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు, అడిషనల్ ఎస్‌పి భాస్కరరావు, సచివాలయం, రైతు భరోసా కేంద్రం, డాక్టర్ వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్ బిల్డింగ్‌లను రిబ్బన్ కట్ చేసి శనివారం ప్రారంభించారు. అనంతరం అక్కడి నుంచి పోతనపల్లి చేరుకొని కారంగుల శ్రీనివాసరావు(వాసు) ఆధ్వర్యంలో సచివాలయం, రైతుభరోసా, హెల్త్ క్లినిక్ బిల్డింగ్‌లను ప్రారంభించారు. మధ్యాహ్నం పోతనపల్లి గ్రామంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కో-ఆపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశి రెడ్డి రాఘవరెడ్డి, చిలికాని బాబ్జి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు పుచ్చకాయలు సుబ్బారెడ్డి, ఎంపిటిసి పోతిరెడ్డిపల్లి కృష్ణ, పామర్తి నాగేశ్వరరావు, చీకటి శ్రీనివాస రావు, సర్పంచి శోభన్ బాబు, కోటపాడు సర్పంచి పరస సత్యనారాయణ పాల్గొన్నారు.

గెలుపొందిన జట్టు

ఆడుదాం ఆంధ్రాలో గురజ జట్టు విజయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా ముదినేపల్లిలో జరిగిన వాలీబాల్ పోటీల్లో ముదినేపల్లి జట్టుపై గురజ జట్టు విజయఢంకా మోగించింది. ముదినేపల్లి జెడ్‌పి హైస్కూల్‌లో జరిగిన మండలస్థాయి వాలీబాల్ ఫైనల్ పోటీల్లో ముదినేపల్లి జట్టుపై గురజ జట్టు విజయం సాధించి విన్నర్‌గా నిలిచింది. నియోజకవర్గస్థాయిలో త్వరలో కైకలూరులో జరగనున్న మ్యాచ్‌కి గురజ జట్టు అర్హత సాధించింది. విన్నర్‌గా నిలిచిన జట్టుకు పలువురు అభినందనలు తెలిపారు.

యువత క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి : డిజిపి

ప్రజాశక్తి - చింతలపూడి

యువత క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని, క్రీడల వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎపి ఫైర్ అండ్ డిజాస్టర్ డిజిపి పివి.సునీల్‌కుమార్ అన్నారు. పట్టణంలో గత మూడు రోజులుగా జరుగుతున్న వాలీబాల్, కబడ్డీ పోటీల ముగింపుకు ఆయన విచ్చేశారు. ఎంపి కోటగిరి శ్రీధర్, ఎస్‌పి మేరి ప్రశాంతి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు వెళ్లకుండా క్రీడల పట్ల ఆసక్తి చూపించాలనే ఉద్దేశంతో ఈ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫైనల్ మ్యాచ్‌లో యర్రగుంటపల్లి-చింతలపూడి జట్ల మధ్య కబడ్డీ టోర్నమెంటు హోరాహోరీగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ వాసుఆనంద్, సెక్రటరీ రాంబాబు, కాకర్ల సత్యం, రజిని పాల్గొన్నారు.

చింతలపూడి : క్రీడాకారులను అభినందిస్తున్న డిజిపి

లక్ష్మీపురంలో అభివృద్ధి కార్యక్రమాలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

పెదవేగి మండలం లక్ష్మీపురం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎంఎల్ఎ అబ్బయ్య చౌదరి శనివారం పాల్గొన్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. లక్ష్మీపురం మండల ప్రజా పరిషత్ పాఠశాలలో మన బడి, నాడు-నేడు ఫేజ్-1 కింద రూ.21.47 లక్షలతో ఏర్పాటు చేసిన ఎన్ఎన్ కాంపోనెంట్స్‌కు, రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, పంచాయతీ పరిధిలోని దిబ్బగూడెంలో రూ.10 లక్షల నిధులతో వేసిన సీసీ రోడ్డుకు ప్రారంభోత్సవం చేశారు. అలాగే లక్ష్మీపురంలో రూ.10 లక్షలతో నిర్మించనున్న నూతన కమ్యూనిటీ హాల్‌కు ఎంఎల్ఎ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణానికి స్థలదానం చేసిన 'చోడిశెట్టి' వారి శిలాఫలకానికి ప్రారంభోత్సవం చేసి ఆ కుటుంబానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. లక్ష్మీపురం గ్రామంలో అర్హులైన 54 మంది లబ్ధిదారులకు వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, సొసైటీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



నూతన భవనాలు ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

వృద్ధ మహిళలకు చీరలు, పళ్లు అందజేత



వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న సత్యనారాయణ

ప్రజాశక్తి - ఏలూరు

ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం పవర్ పేట, ఏలూరులో బాల వికాస్ భారతి ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని వృద్ధ మహిళలకు శారీస్, ఫ్రూట్స్ అందజేయడం జరిగిందని సభకు అధ్యక్షత వహించిన న్యాయవాది బాల వికాస్ భారతి ప్రెసిడెంట్ కట్టా సత్యనారాయణ తెలియజేశారు. పండించిన పంటలు ఇంటికి రాగా, ప్రతి ఒక్కరూ సంతోషంగా పండుగ జరుపుకోవడం జరుగుతుందన్నారు. సంక్రాంతి పండుగలో ప్రతి ఒక్కరూ కొత్త బట్టలతో ముస్తాబవుతారని, వృద్ధులకు కూడా కొత్త బట్టలు అందించి వాళ్లను సంతోషపెట్టాలనే ఆకాంక్షతో ఈ కార్యక్రమం నిర్వహించబడిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మానవతా ప్రతినిధి పి.రత్నాకర్ రావు మాట్లాడుతూ తరతరాలుగా మన పెద్దలు, మన పూర్వీకులు అత్యంత వైభవంగా సంక్రాంతి పండుగను నిర్వహిస్తూ ఒక గొప్ప సాంప్రదాయాన్ని మనకు అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన రిటైర్డ్ పంచాయతీ ఇఒ కమ్మిలి నాగేంద్రరావు మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా వృద్ధులకు నూతన వస్త్రాలు బహూకరించడం చాలా సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమానికి దేవా, లావణ్య, ముత్యం, కార్తీక్ లక్ష్మి హాజరైనారు.

కోడిపందేలకు సిద్ధమైన బరులు

ప్రజాశక్తి - చాట్రాయి

సంక్రాంతి పండుగ అంటేనే కోడిపందేలకు పెట్టింది పేరు.. గత కొన్ని సంవత్సరాలుగా ఆనవాయితీగా వస్తుంది. దానిలో భాగంగా చాట్రాయి మండలంలోని పోతనపల్లి, పర్వతాపురం గ్రామాల సరిహద్దుల్లోని మామిడి తోటల్లో కోడిపందేలు వేయుటకు ఫెన్సింగ్ రాళ్లు తీగ వేసి నిర్వాహకులు బరులు సిద్ధం చేశారు. కోడి పందేలు ఆది, సోమ, మంగళ వారాల్లో నిర్వహిస్తూ ఉండగా ఆంధ్ర ప్రాంతం నుంచి కాకుండా తెలంగాణా రాష్ట్రంలోని బరినపాడు, కందుకూరు, వేంసూరు తదితర గ్రామాల నుంచి కోడిపందేలు వేయుటకు ప్రజలు వేలాదిగా తరలి వస్తారు. ఈ మూడు రోజుల్లో కోట్లాది రూపాయల వ్యాపారం జోరుగా సాగుతుంది. కోడి పందేలు నిర్వహించటం వలన పందెపురాయుళ్లకు మూడు రోజులు పండుగే పండుగ. పందేలు కాసే వాళ్లు కొంతమంది డబ్బులు పోగొట్టుకుంటారు. మరికొందరు డబ్బులు వచ్చాయని ఆనందపడతారు.

మండవల్లి: సంక్రాంతిని పురస్కరించుకొని కోడిపందేలు, నిర్వహించేందుకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. మండవల్లిలో ఆదివారం నుంచి సంక్రాంతి పండుగ ప్రారంభం కావడంతో శనివారం ఉదయం నుంచి కోడిపందేలు నిర్వహించేందుకు కోడిపందేల బరుల ఏర్పాట్లలో నిర్వాహకులు తలమునకలయ్యారు. కోడిపందేలు, పేకాట ఆడేందుకు, చూసేందుకు వచ్చే వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా టెంట్లను, షెడ్లను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు అనుమతులు లేవంటూ జిల్లా సర్కిల్ మండల పరిధి పోలీసులు హెచ్చరికలు జారీ చేసిన బారీ స్థాయిలో కోడిపందేల బరులను ఏర్పాటు చేశారు. మండలంలోనే గ్రామాలలో ఎన్నడూ లేని విధంగా సుమారు 15 చోట్ల బరులు ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఇక కైకలూరు నియోజకవర్గ పరిధిలో వందల సంఖ్యలోనే బరులు ఏర్పాటు చేస్తున్నట్లు వినికిడి. ఈ కోడిపందేల బరులను స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులే దగ్గరుండి నిర్వహిస్తున్నట్లు సమాచారం.



మండవల్లిలో సిద్ధం చేసిన బరులు

పలుచోట్ల పందెం బరులు ధ్వంసం

నూజివీడు రూరల్ : మండలంలోని రావిచర్ల, జంగంగూడెం, దేవరగుంట గ్రామాల్లో కోడిపందేల బరులను రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ శనివారం ట్రాక్టర్లతో దున్నించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ మూడు రోజులు పేకాట, కోడి పందేలకు అనుమతులు లేవని స్పష్టం చేశారు. కోడిపందేలు, పేకాటలు నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముదినేపల్లి : కోడిపందేల నిర్వహణ చట్టరీత్యా నేరమని కోడిపందేలు, పేకాట, గుండాట నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ వెంకటకుమార్ పందేల నిర్వహాకులకు నోటీసులు ఇచ్చారు. పలు చోట్ల బరులు సిద్ధం చేయగా ఎస్ఐ పోలీసులతో వెళ్లి వాటిని ధ్వంసం చేశారు.

భీమడోలు : సంక్రాంతి పండుగను సంప్రదాయబద్ధంగా ఆనందోత్సాహాల మధ్య ఉల్లాసంగా జరుపుకోవాలని ఎస్ఐ వై.సుధాకర్ కోరారు. మండలంలోని పూళ్ళ, గుండుగొలను గ్రామాల్లో సిద్ధం చేసిన బరులను శనివారం సాయంత్రం పోలీసులు ధ్వంసం చేశారు.

రెవెన్యూ భూముల్లో అక్రమ మట్టి తవ్వకాలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని నూతి రామన్నపాలెం పరిధిలో బొత్తప్పగూడెం గ్రామంలోని రెవెన్యూ భూముల్లో అక్రమ మట్టి తోలకాలు జరుగుతున్నాయి. ఈ సమాచారాన్ని రెవెన్యూ సిబ్బందికి తెలియజేయగా అక్రమ మట్టి తోలకం దారులకు, యజమానులకు రెవెన్యూ సిబ్బంది తెలియజేయడంతో జెసిపిలు, టాక్టర్లు అక్కడ నుంచి వెళ్లిపోయాయి. సమస్య అక్కడితో పరిష్కారం అయిపోయింది. ఇదే పరిస్థితి మండలంలో పలుమార్లు జరిగింది. అసలు అక్రమంగా మట్టి తోలకాలు ఎందుకు జరుపుతున్నారు అని ఆ జెసిపి ఓనర్లను గాని, మట్టితోలకందారులను గాని అడిగిన దాఖలాలు ఎప్పుడూ లేవు, జెసిపిలను, టాక్టర్లను పట్టుకొని కేసులు పెట్టి స్వాధీనపరుచుకున్న పరిస్థితులు అసలే లేవు. బుట్టాయగూడెం మండలంలో మట్టి మాఫియా ఆగడాలు మరీ ఎక్కువైపోయాయి, బుట్టాయగూడెం మట్టి మాఫియా దారులకు అడ్డాగా మారింది. కొండలను సైతం కరిగించే సత్తా ఉన్న పాలకులు రెవెన్యూ భూములను తవ్వేస్తున్నారని ప్రజలు, రెవెన్యూ అధికారులకు పలుమార్లు తెలియజేసినా పట్టించుకునే నాథుడే లేడు. మితిమీరిన వేగంతో కనీసం లైసెన్సులు లేని టాక్టర్ల డ్రైవర్ల వల్ల ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అనుమతులు లేని అక్రమ మట్టి రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

మట్టి తరలిస్తున్న పలువురు

మానవత ఆధ్వర్యాన పలు సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - భీమడోలు

స్వచ్ఛంద సంస్థ మానవత భీమడోలు శాఖ శనివారం దాతలు, సంస్థ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు శాఖ అధ్యక్షులు వట్టి సుగుణాకర్ తెలిపారు. దుద్దే పూడి గ్రామం కేంద్రంగా నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా దాతలు, స్థానిక పాఠశాల పూర్వ విద్యార్థులైన షేక్ నాగూర్ బీ, ప్రసన్న, గుళ్ల హర్షలీలల ఆర్థిక సహాయంతో 65 మంది వృద్ధులకు చలికాలం నేపథ్యంలో రగ్గులను గ్రామ సర్పంచి నీలం శ్రీనివాసరావు, ఎంపిటిసి పి.శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు. సంస్థ ఆధ్వర్యంలో భీమడోలుకు చెందిన సాయిరాం క్లాత్ స్టోర్ సౌజన్యంతో ఆర్థిక పరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న నాలుగు కుటుంబాల వారికి బియ్యం, నిత్యావసర వస్తువులు, ఇతరాలతో పాటు దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు గుళ్ల నూకరాజు, పచ్చా వెంకటేశ్వరరావు, పి.కృష్ణారావు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

వృద్ధులకు రగ్గులు పంపిణీ చేస్తున్న సర్పంచి, ఎంపిటిసి

కొబ్బరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

ఎపి కొబ్బరి రైతుల సంఘం వినతి

పెదవేగి : విజయరాయిలో కొబ్బరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని, కొబ్బరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఎపి కొబ్బరి రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.శ్రీనివాస్ కోరారు. శుక్రవారం విజయరాయిలోని ఉద్యాన పరిశోధనా కేంద్రం వద్ద జిల్లా ఉద్యాన అధికారి రామ్మోహన్‌కు కొబ్బరి రైతుల సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. కొబ్బరి రైతుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కొబ్బరి మద్దతు ధర రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కాదని చెప్పారు. బిల్లింగ్ కొబ్బరికి క్వింటాల్‌కు రూ.300 పెంచి రూ.11,160గాను, బంతి కొబ్బరికి క్వింటాల్‌కు రూ.250 పెంచి రూ.12 వేలుగా నిర్ణయించినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ కార్యక్రమంలో కొబ్బరి రైతులు గుడిబండి రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

చెక్కు పోయినది

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అమరావతి బ్రాంచ్, చెక్కు నెం. 807249, Dt. 08-02-2021 CMRF చెక్కు నుంచి రిలీజైన చెక్కు ఇచ్చిన తేదీ, అమౌంట్ రూ. 1,10,000/-లు ది. 10-01-2024వ తేదీన మారంపల్లి నుంచి ద్వారకాతిరుమల జిరాక్స్ నిమిత్తం తీసుకు వెళుతుండగా దారిలో పడిపోయినది. కావున ఎవరికైనను దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌కు తెలియపరచవలెను.

సుధాకర్ నాదెళ్ళ
మారంపల్లి, సెల్: 9505785084